ఈసీపై రాజకీయ రగడ

- సీఈసీ, ఈసీ ఎంపికపై పెద్దఎత్తున దుమారం
- 24 గంటల్లో సుప్రీంకోర్టులో విచారణ ఉండగా అర్ధరాత్రి నియామకం ఏమిటని విపక్షాల నిలదీత
- బీజేపీ రాజకీయ లబ్ధి కోసమేనంటూ విమర్శలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ): భారత ఎన్నికల సంఘం నూతన సారథిగా (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌ను, ఎన్నికల కమిషనర్‌గా (ఈసీ) వివేక్ జోషిని నియమిస్తూ సోమవారం అర్ధరాత్రి గెజిట్ నోటిఫికేషన్లు ఇవ్వడం రాజకీయ దుమారాన్ని రేపింది. సీఈసీ ఎంపికకు సంబంధించిన కేసు సుప్రీంకోర్టులో మరో 24 గంటల్లో (బుధవారం) విచారణకు వస్తుందనగా కేంద్రం తీసుకొన్న ఈ నిర్ణయం సర్వత్రా చర్చనీయాంశమైంది. రాజకీయ లబ్ధికోసమే అధికార బీజేపీ ఈ చర్యలకు పాల్పడుతున్నదని విపక్షాలు ఆరోపిస్తున్నాయి.

కొత్త చట్టం ప్రకారం నియామకం

దేశంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించే కేంద్ర ఎన్నికల సంఘంలోని ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇద్దరు ఎన్నికల కమిషనర్ల (ఈసీ) నియామకాలను గతంలో ప్రధాని నేతృత్వంలోని కేంద్ర మంత్రి మండలి సిఫారసు మేరకు రాష్ట్రపతి చేపట్టేవారు. అయితే, ఈసీల నియామకాలపై కొలీజియం వంటి వ్యవస్థ ఉండాలంటూ సుప్రీంకోర్టులో పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. 2023, మార్చి 2న వీటిని విచారించిన అత్యున్నత న్యాయస్థానం.. సీఈసీ, ఈసీల నియామకాలను ప్రధానమంత్రి, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, సీజేఐ సభ్యులుగా ఉన్న కమిటీ సిఫారసులతో రాష్ట్రపతి నియమించాలని ఆదేశించింది. అయితే, సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన ఐదు నెలల్లోనే బీజేపీ ప్రభుత్వం ప్రధాన ఎన్నికల అధికారి, ఇతర ఎన్నికల

కమిషనర్ల (నియామకాలు, సర్వీసుల నిబంధనలు, పదవీకాలం) చట్టం, 2023 పేరిట కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. సీఈసీ, ఈసీల నియామకాలను ప్రధాని, లోక్‌సభలో ప్రతిపక్ష నేత, క్యాబినెట్ మంత్రి సభ్యులుగా ఉన్న కమిటీ సిఫారసులతో రాష్ట్రపతి నియమించాల్సి ఉంటుంది. కమిటీలో సీజేఐను తప్పించి కేంద్రమంత్రిని చేర్చుతూ కేంద్రం ఈ చట్టాన్ని తీసుకొచ్చిందన్న మాట.

వివాదం ఎందుకు?

తాజా చట్టం ప్రకారం కమిటీ తీసుకొనే ప్రతీ నిర్ణయంపై అధికార పక్షానిదే పైచేయిగా ఉంటుంది. ఇదే విపక్షాల ఆందోళనకు ప్రధాన కారణంగా మారింది. ఈ క్రమంలోనే కొత్త చట్టాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. బుధవారం దీనిపై కోర్టు విచారణ జరుపనున్నది. ఈ సమయంలోనే సీఈసీగా జ్ఞానేశ్‌కుమార్, ఈసీగా వివేక్ జోషిని మోదీ నేతృత్వంలోని త్రిసభ్య కమిటీ ఖరారు చేసింది. సుప్రీంకోర్టులో విచారణ ముగిసేవరకూ సీఈసీ ఎంపికను వాయిదా వేయాలంటూ రాహుల్ కమిటీ సభ్యులకు సూచించినా కేంద్రం పరిగణనలోకి తీసుకోలేదు. ఎంపిక కమిటీ నుంచి సీజేఐను తప్పించడం ద్వారా ఈసీపై ప్రభుత్వం నియంత్రణ కోరుకుంటున్నదనే విషయం స్పష్టమవుతున్నదని కాంగ్రెస్ ఆరోపించింది. ఈసీని బీజేపీ విభాగంగా మార్చే లక్ష్యం విజయవంతమైందని టీఎంసీ ఆరోపించింది. అమిత్ షాను నూతన సీఈసీగా సంబోధించింది. అయితే, కాంగ్రెస్ పార్టీనే అధికారంలో ఉన్నప్పుడు ఈసీఐను దుర్వినియోగం చేసిందని, విధేయులను సీఈసీ, ఈసీలుగా నియమించిందని బీజేపీ ఆరోపించింది. వారి సేవలు పొంది, పదవీ విరమణ తర్వాత వారికి పలు ప్రయోజనాలు కల్పించిందని పేర్కొన్నది.

సీఈసీ, ఈసీల నియామకంపై
నేడు సుప్రీం విచారణ

సీఈసీ, ఈసీ నియామకాలకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్లపై "ప్రాధాన్యత ప్రాతిపదికన" బుధవారం విచారణ చేపడతామని సుప్రీంకోర్టు మంగళవారం తెలిపింది. భారత ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)తో కూడిన ప్యానెల్ ద్వారా సీఈసీ, ఈసీల ఎంపిక, నియామకం జరగాలని 2023లో రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం మాత్రం సీజేఐని ప్యానెల్ నుంచి మినహాయించి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందని ఓ ఎన్జీఓ తరపున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టు దృష్టికి తీసుకువచ్చారు. రాజ్యాంగ ధర్మాసనం తీర్పును అగౌరవపరుస్తూ ప్రభుత్వం 2023 చట్టం ప్రకారం సీఈసీ, ఈసీలను నియమించిందని, అత్యవసరంగా విచారించాల్సిన ఈ అంశానికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి జాబితాలో పైన ఉంచాలని ప్రశాంత్ భూషణ్ ధర్మాసనాన్ని అర్థించారు. దీనికి న్యాయమూర్తులు స్పందిస్తూ ఫిబ్రవరి 19న అత్యవసర కేసులను విచారించిన తర్వాత ఈ పిటిషన్లపై విచారణ చేపడతామని న్యాయవాదులకు హామీ ఇచ్చారు.

నీ మనసులోని చెత్తను వెళ్లగక్కావు

- *నీ వ్యాఖ్యలు మన సమాజాన్ని సిగ్గు పడేలా చేశాయి తెలుసా*
- *వాక్ స్వాతంత్ర్యం పేరిట ఎవరైనా ఏది పడితే అది మాట్లాడరాదు*
- *యూట్యూబర్ అల్లాబాదియాపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం*
- *అరెస్టు కాకుండా ఊరటను కల్పించిన న్యాయస్థానం*

*న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: యూట్యూబర్ రణ్‌వీర్ అల్లాబాదియాపై సుప్రీంకోర్టు తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. 'ఇండియాస్ గాట్ టాలెంట్' యూట్యూబ్ షోలో పాల్గొన్న సమయ్ రైనాను ఉద్దేశించి రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'నీ వ్యాఖ్యలు నీ వక్ర మనస్తత్వాన్ని చూపుతున్నాయి' అని వ్యాఖ్యానించింది. సమయ్ రైనాను అతని తల్లిదండ్రులు, శృంగారం గురించి ప్రశ్నిస్తూ రణ్‌వీర్ చేసిన వ్యాఖ్యలపై దేశవ్యాప్తంగా నిరసన వ్యక్తం కాగా పలు రాష్ట్రాల్లో అతనిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. దీంతో తనపై నమోదైన ఎఫ్ఐఆర్‌లన్నింటినీ ఒకే చోట చేర్చి విచారణ జరపాలని, తనను అరెస్టు కాకుండా ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రణ్‌వీర్ సుప్రీంకోర్టును ఆశ్రయించాడు. దీనిపై మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్‌సింగ్‌తో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. 'నీ మనసులో ఉన్న చెత్తను యూట్యూబ్ షోలో వెళ్లగక్కావు. నీవు వాడిన పదాలు ఈ దేశపు కుమార్తెలు, సోదరీమణులు, తల్లిదండ్రులను, సమాజాన్ని కూడా సిగ్గుపడేలా చేశాయి. ఇది నీ వక్రబుద్ధిని ప్రదర్శిస్తున్నది' అంటూ న్యాయమూర్తులు మండిపడ్డారు. 'సమాజంలో ఉన్న విలువలేమిటి? ఆ విలువల కున్న ప్రమాణాలేమిటో నీకు తెలుసా? వాక్ స్వాతంత్ర్యం పేరిట సమాజ నియమాలకు విరుద్ధంగా ఏది పడితే అది మాట్లాడేందుకు ఎవరికీ లైసెన్స్ లేదు' అని

స్పష్టంచేసింది. అతనికి వ్యతిరేకంగా అనేక సంఖ్యలో నమోదైన ఎఫ్ఐఆర్‌లను, అతనికి వస్తున్న బెదిరింపులను దృష్టిలో ఉంచుకొని బెయిల్ మంజూరుచేస్తున్నట్టు తెలిపింది. ఇకపై అతని మీద ఎఫ్ఐఆర్‌లను నమోదు చేయరాదని కోర్టు ఆదేశించింది. అల్లాబాదియావి, అతని అనుచరుల ప్రదర్శనలను యూట్యూబ్‌లో ప్రసారం చేయరాదని ఆదేశించింది. అల్లాబాదియా తన పాస్‌పోర్టును ఠాణె పోలీస్‌స్టేషన్‌లో జప్తు చేయాలని ఆదేశించింది.

ఆర్నెల్లలో మహిళలకు క్యాన్సర్ టీకా
కేంద్ర మంత్రి ప్రతాప్‌రావ్ జాదవ్ వెల్లడి

ఛత్రపతి శంభాజీ నగర్, ఫిబ్రవరి 18: దేశంలోని మహిళలకు ఆరు నెలల్లో క్యాన్సర్ టీకాను అందుబాటులోకి తీసుకురానున్నట్టు కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి ప్రతాప్ జాదవ్ మంగళవారం వెల్లడించారు. మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీ నగర్‌లో జరిగిన ఓ పత్రికా సమావేశంలో

ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ టీకా పరిశోధన దాదాపుగా పూర్తయిందని.. ప్రస్తుతం ట్రయల్స్ కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. *9-16* ఏండ్ల లోపు బాలికలు టీకా వేసుకోవడానికి అర్హులన్నారు. 'దేశంలో క్యాన్సర్ బాధితులు పెరుగుతున్నారు. సమస్య పరిష్కారానికి కేంద్రం చర్యలు చేపడుతున్నది. *30* ఏండ్ల పైబడిన మహిళలకు దవాఖానల్లో స్క్రీనింగ్ నిర్వహిస్తారు. క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడానికి డే కేర్ క్యాన్సర్ కేంద్రాలను నెలకొల్పుతాం' అని ఆయన తెలిపారు. ప్రభుత్వ దవాఖానల్లో ఆయుష్ విభాగాలున్నాయని.. ప్రజలు వాటిని వైద్యం కోసం ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

బీపీ, షుగర్, క్యాన్సర్‌కు ఉచిత స్క్రీనింగ్

- *20* నుంచి దేశవ్యాప్తంగా నిర్ధారణ పరీక్షలు
- కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ వెల్లడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: అధిక రక్త ప్రసరణ(హైబీపీ), మధుమేహం, క్యాన్సర్ వంటి వ్యాధులకు సంబంధించి దేశవ్యాప్తంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్టు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంగళవారం

ప్రకటించింది. ఫిబ్రవరి *20* నుంచి మార్చి *31* వరకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు జరుగుతాయని ప్రభుత్వం తెలిపింది. *30* సంవత్సరాలు పైబడిన వ్యక్తులు తమ సమీపంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రంలో ఈ వ్యాధులకు సంబంధించిన నిర్ధారణ పరీక్షలను ఉచితంగా చేయించుకోవాలని ప్రభుత్వం సూచించింది. హైబీపీ, డయాబెటిస్, ఓరల్, బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్‌కు సంబంధించిన వ్యాధి నిర్ధారణ పరీక్షలు దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలు నిర్వహిస్తాయని ప్రభుత్వం ఎక్స్ వేదికగా తెలిపింది. మూపు మందగించడం, ఆకలి పెరగడం, గాయాలు మానకపోవడం, అలసట, తరచు దాహం వేయడం, అకస్మాత్తుగా బరువు తగ్గడం, తరచు మూత్ర విసర్జన వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసింది.

ఒక్క గ్రాము ధర 53 వేల కోట్లు!

- ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన పదార్థం 'యాంటీమ్యాటర్'
- ఒక్క గ్రాము తయారీకి లక్షల సంవత్సరాల సమయం
- అందుబాటులోకి వస్తే అంతులేని శక్తి ఉత్పత్తికి చాన్స్

న్యూయార్క్, ఫిబ్రవరి 18: ప్రపంచంలో అత్యంత ఖరీదైన పదార్థం ఏంటి ? అనే ప్రశ్న ఎదురైతే వజ్రం, బంగారం, ప్లాటినం ఇలా అనేక సమాధానాలు వస్తాయి. అయితే, వీటన్నింటి కంటే ఖరీదైన పదార్థం ఒకటి ఉంది. అదే 'యాంటీమ్యాటర్'. మిగతా ఖరీదైన పదార్థాల్లా దీనిని భూమి నుంచి తవ్వి తీయడానికి కుదరదు. ఒక్కో పరమాణువును కలుపుతూ దీనిని తయారుచేయాలి. ఇప్పుడు మనం చూస్తున్న విశ్వం ఆటమ్‌లు, ప్రోటాన్లు, న్యూట్రాన్లు, ఎలక్ట్రాన్లు, సబ్ ఆటమిక్ కణాలతో కూడిన 'మ్యాటర్'తో ఆవిర్భవించింది. ప్రతి మ్యాటర్ కణాలకు ప్రతిబింబం లాంటి యాంటీమ్యాటర్ కణాలు ఉంటాయి. మ్యాటర్ కణాలకు పాజిటివ్ ఛార్జ్ ఉంటే, యాంటీమ్యాటర్ కణాలకు నెగటివ్ ఛార్జ్ ఉంటుంది. ఈ యాంటీమ్యాటర్ తయారీ ఎంతటి క్లిష్టమైన ప్రక్రియ అంటే.. ఒక్క గ్రాములో పదో వంతు తయారుచేయడానికి లక్షల సంవత్సరాలు పడుతుంది. అందుకే, ఒక్క గ్రాము యాంటీమ్యాటర్ తయారు చేయడానికి రూ.*53* వేల కోట్లు ఖర్చవుతుందని అంచనా. *1999*లో నాసా శాస్త్రవేత్త హరోల్డ్ గెరిష్ ఈ అంచనా వేశారు. దీని తయారీకి కూడా అత్యాధునిక సాంకేతికత అవసరం. స్విట్జర్లాండ్‌లోని ఐరోపా అణు పరిశోధన సంస్థ సెర్న్ ఇప్పుడు యాంటీమ్యాటర్ తయారీకి ప్రయత్నిస్తున్నది. ఇందుకోసం భారీ పార్టికల్ యాక్సెల రేటర్లను వినియోగిస్తున్నది. ఇంత భారీ మొత్తంలో వెచ్చించి తయారుచేసే యాంటీ మ్యాటర్‌ను ఎక్కడ వినియోగిస్తారనేది కూడా ఆసక్తికరమే. యాంటీ మ్యాటర్ అంతులేని శక్తిని ఉత్పత్తి చేస్తుంది కాబట్టి అంతరిక్ష పరిశోధనలకు దీనిని ఉపయోగించవచ్చని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. యాంటీమ్యాటర్‌ను భద్రపర్చడం అత్యంత కష్టం. ఇది మ్యాటర్‌తో కలిసినప్పుడు పేలుడు సంభవించి భారీగా శక్తి ఉత్పత్తి అవుతుంది. కాబట్టి, మ్యాటర్‌తో కలవకుండా యాంటీమ్యాటర్‌ను భద్రపరచాలి. ఇది కేవలం ఎలక్ట్రోమ్యాగ్నెటిక్ క్షేత్రాల్లో మాత్రమే సాధ్యమని భావిస్తున్నారు.



500 కోట్ల మందికి అందుబాటులో లేని మెడికల్ ఆక్సిజన్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ప్రపంచ జనాభాలో మూడింట రెండొంతుల మందికి, అంటే సుమారు *500* కోట్ల మందికి మెడికల్ ఆక్సిజన్ అందుబాటులో లేదని, తక్కువ, మధ్యస్థాయి ఆదాయం గల దేశాలలో ఈ పరిస్థితి ఎక్కువగా ఉందని లాన్సెట్ కమిషన్ తాజా నివేదిక వెల్లడించింది. శస్త్ర చికిత్స, ఉబ్బసం, అత్యవసర చికిత్సను పొందే రోగులతోపాటు ప్రసవ సమయంలో తల్లి, బిడ్డల ఆరోగ్య రక్షణకు అందచేసే చికిత్సలో మెడికల్ ఆక్సిజన్ అత్యవసరం.

కోస్టారికాకు భారత అక్రమ వలసదారులు
తరలించనున్న అమెరికా

శాన్ జోస్: తమ దేశంలో నివసిస్తున్న అక్రమ వలసదారుల్లో కొందరిని అమెరికా కోస్టారికా దేశానికి తరలించనుంది. అలా తరలిస్తున్న వారిలో పలువురు భారతీయులు కూడా ఉన్నారు. అమెరికా పంపించి వేస్తున్న వలసదారులకు ఆశ్రయం కల్పించి వారిని వారి దేశాలకు పంపడంలో వారధిగా పనిచేయనున్నట్టు కోస్టారికా ప్రకటించింది. దీంతో భారత్, మధ్య ఆసియాకు చెందిన పలువురు అక్రమ వలసదారులను అమెరికా అక్కడికి తరలించనుంది. ఇటీవల ప్రధాని మోదీ అమెరికా పర్యటన తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. దీనిలో భాగంగా తొలి విడతగా, 200 మంది అక్రమ వలసదారులు ప్రత్యేక విమానంలో బుధవారం జువాన్ శాంటమేరియా అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకుంటారని కోస్టారికా అధ్యక్షుడు రొడిగ్రో చేవ్స్ రోబ్లెస్ కార్యాలయం ప్రకటించింది. వీరంతా మధ్య ఆసియా, భారత్‌కు చెందిన వారని వెల్లడించింది. వీరిని ఆయా దేశాలకు తరలించే ముందు తాత్కాలికంగా ఏర్పాటు చేసిన శిబిరాలకు తరలిస్తామన్నారు. ఇందుకు అమెరికాయే నిధులను సమకూరుస్తుంది. కాగా, అమెరికా ఇప్పటికే 332 మంది మంది భారతీయ అక్రమ వలసదారులను భారత్‌కు పంపిన విషయం తెలిసిందే.

రన్‌వేపై విమానం బోల్తా
టొరంటో విమానాశ్రయంలో ప్రమాదం

టొరంటో, ఫిబ్రవరి 18: కెనడాలోని టొరంటో విమానాశ్రయంలో డెల్టా ఎయిర్‌లైన్స్ జెట్ బోల్తా పడింది. ల్యాండింగ్ అవుతున్న సమయంలో మంచుతో కూడిన రన్‌వేపై అదుపుతప్పి పల్టీకొట్టింది. విమానంలోని 80 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బతికి బయటపడ్డారని విమానాశ్రయ ముఖ్య కార్య నిర్వహణాధికారి తెలిపారు. గంటకు 65 కి.మీ వేగంతో మంచుతో కూడిన గాలులు బలంగా వీయడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక విచారణలో తేలింది. 'అకస్మాత్తుగా ప్రతిదీ పక్కకు జరిగిపోయింది. రెప్పపాటు కాలంలో నేను తల కిందులుగా చిక్కుకుపోయాను' అని పీటర్ కార్ల్‌సన్ అనే ప్రయాణికుడు పేర్కొన్నారు. ప్రమాదం జరిగిన కొద్ది సేపటికే అత్యవసర సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. గత మూడు వారాల్లో ఉత్తర అమెరికాలో జరిగిన నాలుగో అతి పెద్ద విమాన ప్రమాదం ఇది.

కశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలి
భారత్‌ను కోరుతూ పాక్ పార్లమెంట్ తీర్మానం

ఇస్లామాబాద్, ఫిబ్రవరి 18: కశ్మీర్‌పై పాకిస్థాన్ మరోసారి కవ్వింపు చర్యకు దిగింది. కశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ జరపాలని భారత్‌ను కోరుతూ ఆ దేశ పార్లమెంట్ మంగళవారం ఒక తీర్మానాన్ని చేసింది. అలాగే కశ్మీర్‌లో 370 ఆర్టికల్ రద్దును ఖండిస్తూ కశ్మీర్ లోయలో మానవ హక్కుల ఉల్లంఘన జరుగుతున్నదని విమర్శించింది. మన దేశ నేతలు, మిలటరీ అధికారులు పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్, గిల్గిత్ బాల్టిస్థాన్‌పై రెచ్చగొట్టే ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించింది.

తాగునీటిని వేరే అవసరాలకు
వాడితే జరిమానా
బెంగళూరు నీటి సరఫరా బోర్డు ఆదేశాలు

బెంగళూరు, ఫిబ్రవరి 18: వేసవికి ముందే కర్ణాటకలో నీటి కష్టాలు తీవ్రమయ్యాయి. తాగునీటిని అత్యవసరం కాని వాటికి వాడితే రూ.5 వేలు జరిమానా విధిస్తామని బెంగళూరు వాసులను ఆ నగర నీటి సరఫరా, మురుగు నిర్వహణ బోర్డు హెచ్చరించింది. వాహనాలను శుభ్రం చేయడానికి, తోటపనికి, భవన నిర్మాణానికి, వినోదానికి, ఫౌంటెన్ల లాంటి అలంకరణ పనులకు తాగునీటి వాడకాన్ని నిషేధిస్తున్నట్టు తెలిపింది. మాల్స్, సినిమా హాళ్లు నీటిని కేవలం తాగడానికి మాత్రమే వినియోగించాలని స్పష్టం చేసింది. కొన్ని రోజులుగా నగరంలో వర్షాలు పడకపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించింది. నిబంధనలు ఉల్లంఘించిన వారికి తొలిసారి రూ.5 వేలు, ఆ తర్వాత ఉల్లంఘనలకు రోజుకు రూ.500 చొప్పున జరిమానా విధిస్తామని తెలిపింది. నగరంలో ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో నీటిని పొదుపుగా వాడుకోవడం, నీటి వృథాను అరికట్టడం అవసరమని బోర్డు పేర్కొంది.

యుద్ధం ముగింపుపై సంప్రదింపులకు బృందాలు
సౌదీలో అమెరికా, రష్యా
విదేశాంగ మంత్రుల భేటీలో నిర్ణయం
చర్చల తీరుపై జెలెన్‌స్కీ గుస్సా.. సౌదీ పర్యటన వాయిదా

రియాధ్, ఫిబ్రవరి 18: రష్యా- ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించే దిశగా మరో ముందడుగు పడింది. మంగళవారం సౌదీ అరేబియాలో అమెరికా, రష్యా విదేశాంగ శాఖ మంత్రులు మార్కో రుబియో, సెర్గేయ్ లావ్రోవ్ సమావేశమయ్యారు. వీలైనంత త్వరగా యుద్ధాన్ని ముగించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. ఈ ప్రక్రియను చేపట్టేందుకు ఇరు దేశాలు ఉన్నత స్థాయి బృందాలను నియమించాయి. యుద్ధాన్ని ముగించడంతో పాటు అమెరికా – రష్యా సంబంధాలను పునరుద్ధరించుకోవడానికి చర్యలు తీసుకోవాలని ఈ సమావేశంలో ఇరు దేశాల మంత్రులు నిర్ణయం తీసుకున్నారు. అమెరికా – రష్యా చర్చల తీరుపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ సమ్మతి లేకుండా తమపై రుద్దే రాజీ ఒప్పందాన్ని ఉక్రెయిన్ అంగీకరించబోదని ఆయన స్పష్టం చేశారు. ఈ చర్చల నేపథ్యంలో ఈ వారం జరగాల్సిన తన సౌదీ పర్యటనను మార్చికి వాయిదా వేసుకున్నారు.

అమెరికాపై ఆధారపడలేం: జెలెన్‌స్కీ

అమెరికాపై ఆధారపడకుండా సొంత సైన్యాన్ని నిర్మించుకోవాలని ఐరోపా దేశాలకు ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పిలుపునిచ్చారు. రష్యా – ఉక్రెయిన్ యుద్ధంపై అమెరికా వైఖరి క్రమంగా మారుతున్న నేపథ్యంలో జెలెన్‌స్కీ ఈ వ్యాఖ్యలు చేశారు. మ్యూనిచ్ భద్రతా సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అమెరికా నుంచి ఇక మీదట ఐరోపాకు కచ్చితమైన భద్రతా సహకారం అందకపోవచ్చని, ఐరోపా ప్రయోజనాలకు రక్షణ ఉంటున్న తన సంప్రదాయ పాత్ర నుంచి అమెరికా వెనక్కు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. రష్యా కొత్తగా 1.5 లక్షల మందిని సైన్యంలో నియమించుకుంటున్నదని, బెలారస్‌లో బలగాలను మోహరిస్తున్నదని, ఐరోపా భద్రతకు ఇది ముప్పుగా మారుతుందని హెచ్చరించారు. అయితే, ఐరోపాకు ప్రత్యేక సైన్యం ఉండాలని జెలెన్‌స్కీ చేసిన ప్రతిపాదనను ఐరోపా దేశాలు తోసిపుచ్చాయి.

పీఆర్ కోసం పెండ్లిళ్లు

- కెనడా, అమెరికాలో వెలుగు చూస్తున్న ఏజెన్సీల మోసాలు
- పీఆర్, గ్రీన్ కార్డుల కోసం దొంగ వివాహాల నిర్వహణ
- దొరికితే భారీ జరిమానాతో పాటు జైలు శిక్షలకు అవకాశం

టొరంటో, ఫిబ్రవరి 18: 'నిజమైన ప్రేమ నేరం కాదు.. కానీ మోసపూరిత వివాహం నేరం' అని ప్రేమికుల దినోత్సవం సందర్భంగా కెనడా పౌరులను అప్రమత్తం చేస్తూ ఇమ్మిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా(ఐఆర్‌సీసీ) 'ఎక్స్'లో చేసిన పోస్ట్ ఇది. కెనడా శాశ్వత నివాసం(పీఆర్) కోసం కొందరు ట్రాప్ చేయవచ్చని, మోసపూరితంగా వివాహం చేసుకోవచ్చని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఈ సూచన చేసింది. కెనడాలోనే కాదు అమెరికా గ్రీన్ కార్డు పొందేందుకు సైతం ఇలా దొంగ వివాహాలు చేసుకుంటున్న ఉదంతాలు తెరపైకి వస్తున్నాయి. ఏదైనా దేశం వారు కెనడా లేదా అమెరికాలో శాశ్వతంగా స్థిరపడేందుకు ఆ దేశాల పౌరులను వివాహం చేసుకోవడం దగ్గరి దారి. ఇలా చేయడం ద్వారా త్వరగా పీఆర్ లేదా గ్రీన్ కార్డు పొందవచ్చు. ఒక్కొక్కరి నుంచి రూ.17-30 లక్షల వరకు తీసుకుంటూ దొంగ పెండ్లిళ్లు చేయించి పీఆర్ ఇప్పిస్తున్న ఏజెన్సీల గుట్టు కూడా అప్పుడప్పుడు బయటపడుతూనే ఉంది.

దొరికితే అంతే సంగతి

గ్రీన్ కార్డు కోసం అమెరికా పౌరులను వివాహం చేసుకున్నట్టు తేలితే కఠిన శిక్షలే ఉన్నాయి. 2023లో విక్రాంత్ చౌహాన్(35) అనే వ్యక్తికి ఈ పని చేసినందుకు కోర్టు ఐదేండ్ల జైలుశిక్ష, రూ.2.2 కోట్ల భారీ జరిమానా విధించింది. కెనడాలోనూ శిక్షలు కఠినంగానే ఉంటాయి. జరిమానా, జైలుశిక్షతో పాటు దేశ బహిష్కరణ్ణ కెనడాలోకి నిషేధించడం వంటి శిక్షలు ఉన్నాయి. డాక్యుమెంట్ల పరిశీలన, ఇండ్లకు వెళ్లి తనిఖీలు చేయడం, భార్యాభర్తలను విచారించడం ద్వారా ఇలాంటి మోసాలను ఐఆర్‌సీసీ గుర్తిస్తున్నది.

సివిల్స్ ప్రిలిమ్స్ దరఖాస్తు
గడువు పొడిగింపు
ఈ నెల 21 చివరి తేదీ: యూపీఎస్సీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: ఈ ఏడాది నిర్వహిస్తున్న సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష దరఖాస్తు గడువును యూపీఎస్సీ (యునియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్) మరోసారి పొడిగించింది. ఫిబ్రవరి 21 సాయంత్రం 6 గంటల వరకు గడువు పొడిగించినట్టు యూపీఎస్సీ వెబ్‌సైట్ తాజాగా పేర్కొన్నది. ఈ నెల 22 నుంచి 28 వరకు అభ్యర్థులు తమ దరఖాస్తుల్లో తప్పొప్పులను దిద్దుకోవచ్చునని తెలిపింది. ఈ ఏడాది సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు మే 25న నిర్వహిస్తున్నారు. తొలుత దరఖాస్తు గడువు ఫిబ్రవరి 11 కాగా, ఈ నెల 18కు గడువు మార్చారు. తాజాగా మరోసారి గడువు పొడిగించారు.

సజ్జన్ కుమార్‌కు మరణశిక్ష విధించాలి
ప్రత్యేక కోర్టుకు ప్రాసిక్యూషన్ వినతి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 18: దేశ రాజధానిలో 1984లో జరిగిన సిక్కు వ్యతిరేక అల్లర్లకు సంబంధించిన జంట హత్యల కేసులో దోషిగా తేలిన కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ సజ్జన్ కుమార్‌కు మరణ శిక్ష విధించాలని మంగళవారం న్యాయస్థానాన్ని ప్రాసిక్యూషన్ కోరింది. ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది తమ వాదనను లిఖిత రూపంలో ప్రత్యేక న్యాయమూర్తి కావేరీ బవేజాకు అందచేశారు. హత్య కేసులో కనీస శిక్ష యావజ్జీవ కారాగారం కాగా అత్యంత అరుదైన ఈ కేసులో దోషికి మరణ శిక్ష విధించాలని ప్రాసిక్యూషన్ కోరింది. తమ వాదనను సమర్పించడానికి కొంత వ్యవధి కావాలని సజ్జన్ కుమార్ తరపు న్యాయవాది కోర్టును కోరారు. దీంతో కేసును ఫిబ్రవరి 21కి ప్రత్యేక న్యాయమూర్తి వాయిదా వేశారు.

బండ్‌కు పిలుపునిచ్చిన మావోయిస్టులు
తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో హై అలర్ట్

కొత్తగూడెం ప్రగతి మైదాన్: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు బండ్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ పోలీసులు మంగళవారం హై అలర్ట్ ప్రకటించారు. ఆపరేషన్ 'కగార్'కు నిరసనగా బీజాపూర్-సుక్మా-దంతెవాడ జిల్లాల బండ్‌కు మావోయిస్టులు పిలుపునిచ్చారు. దీంతో ఇరు రాష్ట్రాల పోలీసు యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, పూసుగుప్ప, మారాయిగూడెం అటవీ ప్రాంతాల్లో భద్రతా దళాలు గాలింపు చర్యలు ముమ్మరం చేశాయి. బండ్ నేపథ్యంల